# విద్యార్థుల, ప్రజా ప్రతినిధుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్

కామారెడ్డి, బతుకమ్మ :జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు, అలాగే ఇటీవల ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర నాయకులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని కర్షక్ బీఈడీ కళాశాల లో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్య, సామాజిక సేవ, ప్రజా నాయకత్వ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గౌడ బంధువులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గౌడ సమాజ యువత విద్యా రంగంలో మరింత ముందుకు రావాలని, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఇటీవల గ్రామాలు, పట్టణాల్లో ప్రజా సేవకు ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులను సన్మానించడం ద్వారా సమాజ ఐక్యతను చాటాలని



అన్నారు. ఈ కార్యక్రమానికి గౌడ బంధువులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న గారి శ్రీనివాస్ గౌడ్, ఇందూరి సిద్ధా గౌడ్, నరేష్ గౌడ్, కరోల్ల శేఖర్ గౌడ్, అంకన్న గారి గంగాధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరీల ముఠాను పట్టుకున్న టౌన్ - 1 పోలీసులు

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :బైక్‌లను దొంగిలిస్తూ పలుచోట్ల చోరీలకు పాల్పడుతున్న నేరస్తుడిని నిజామాబాద్ టౌన్ - 1 పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఇన్స్ పెక్టర్ బి.రఘుపతి తెలిపారు. ఈ మేరకు టౌన్-1 పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 36/2026 కింద కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు వధేరా నవీన్ (22), కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్గల్ మండలం శివపురం గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో నివాసం ఉంటూ మేస్త్రి పని చేస్తున్నాడు. అతను ఫాల్స్ కీ సహాయంతో పార్క్ చేసిన బైక్‌లను దొంగిలించేవాడని పోలీసులు తెలిపారు. జనవరి 2026 లో నిజామాబాద్ రైల్వే స్టేషన్ రోడ్డులోని కవిత కాంప్లెక్స్ ముందు పార్క్ చేసి ఉన్న గ్లామర్ బైక్ టీ ఎస్ 16 ఈ ఎన్



6948 ను దొంగిలించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం ఆ బైక్‌పై బాన్సువాడ వెళ్లి తిరిగి వస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అతన్ని ఆపారు. వాహన పత్రాలు చూపించాలని అడగగా నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని విచారించారు. విచారణలో అతను పలు బైక్ చోరీ కేసుల్లో తన ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. టౌన్-1, ఎల్లారెడ్డి, బాన్సువాడ, పిట్లం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొత్తం ఆరు కేసుల్లో అతను నిందితుడిగా ఉన్నట్లు వెల్లడైంది. ఇక ఈ బైక్‌లను తక్కువ ధరకు కొనుగోలు చేసిన మరో ఇద్దరు నేరస్తులు మొహమ్మద్ మోయిజ్, అలకుంట మోహన్‌లను కూడా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ కామారెడ్డి జిల్లా సోమేశ్వర గ్రామానికి చెందినవారు. దొంగిలించిన బైక్‌లేనని తెలిసినా కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు మొత్తం ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ప్రధాన నేరస్తుడు వధేరా నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్-1 ఇన్స్ పెక్టర్ బి. రఘుపతి వెల్లడించారు.



# 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే ఓట్లు అడగాలి

## మంత్రి పొంగులేటికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

హైదరబాద్, బతుకమ్మ : హైదరాబాద్ నగరంలో ఇండ్ల నిర్మాణం పైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి ప్రతి సవాలు చేశారు. గతంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతాం అని చాలెంజ్ చేసిన మంత్రికి ఆ మాట నిలబెట్టుకునే దమ్ముందా ? అని కేటీఆర్ నిలదీశారు. మంత్రి తాను చేసిన సవాలుకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. సవాళ్లు చేయ డం, ఆపై పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటేనని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కేవలం శపథం చేయడం కాదని, చేతనైతే చేసి చూపించాలన్నారు. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే ప్రజల గుమ్మం తొక్కి ఓట్లు అడుగుతాం అన్న సవాల్‌కు పౌరుషం ఉంటే కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని ప్రతిన బూనాలని సవాల్ విసిరారు. ఆత్మ గౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ తమదని కేటీఆర్ ఉద్ఘాటించారు. స్వరాష్ట్రాన్ని సాధించామని, పేదల స్వగృహ స్వప్నాలను సాకారం చేశామన్నారు. డబ్బా ఇండ్లు కాకుండా, డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించామన్నారు. హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించిన ఘనత తమదేనని గుర్తుచేశారు. తాము 70 వేలతో అగ్గిపెట్టె ఇండ్లు కట్టలేదని, తాము కట్టిన ఒక్కో గృహం 7 ఇందిరమ్మ ఇండ్లతో సమానమన్నారు. చరిత్రలో ఎవరూ ఎప్పుడూ చేయని సాహసంతో, 60 ఏండ్లు ఏలిన పార్టీలకు ఎన్నడూ రాని ఆలోచనతో దేశానికి నమూనాగా అందమైన పొదరిల్లను నిర్మించి చూపించామని తెలిపారు. మీకు చిత్తశుద్ధి, సత్తా ఉంటే అంతకు మించి హైదరాబాద్‌లో డబుల్ బెడ్ రూం గృహాలను కట్టాలని సవాల్ చేశారు. గృహ నిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం తామైతే, గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు కాంగ్రెస్ నేతలని కేటీఆర్ మండిపడ్డారు. ఇటుకలు పేర్చి ఇండ్లు కట్టింది తామైతే, పేదల ఇండ్లమీద బుల్డోజర్లు ఎక్కించి కూలగొడుతున్న క్రూరులు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీకెండ్‌లో మంది కొంపలు కూల్చి వికృతానందం పొందుతున్న మీరు ఇండ్లు కట్టడం గురించి మాట్లాడటానికి సిగ్గుండాలి కదా అని ఎద్దేవా చేశారు. గత రెండున్నర ఏండ్లలో నగరంలో కట్టిన ఇండ్లు ఎన్ని? పడగొట్టిన ఇండ్లు ఎన్ని? అనే దానిపై శ్వేత పత్రం ప్రకటించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దీపావళికి బాంబులు పేలుస్తామని చెప్పి తుస్సు మనిపించిన 'తుపేల్ మినిస్టర్', 'మిస్టర్ బాంబులేటి' అంటూ పొంగులేటిపై తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమకు తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడం, ఆత్మాభిమానంతో బతకడం మాత్రమే తెలుసని కేటీఆర్ స్పష్టం చేశారు. మీలాగా కోహినూరు హోటల్లో కాళ్లు పట్టుకొని, ఢిల్లీకి లొంగిపోయి కేసుల నుంచి తప్పించుకునే ఉపాయం తమకు తెలియదన్నారు. అడ్డదారుల్లో కొడుకు కంపెనీకి వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకులు, అక్రమ క్రషర్లు నడుపుతూ అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు తమకు తెలియవన్నారు. రెవిన్యూ శాఖను అడ్డుపెట్టుకొని భూభారతిలో బ్లాక్ లిస్టులు, బ్లాక్ మెయిల్ దందాలు చేసి దండుకునే ల్యాండ్ గేమ్స్, గూండాలను ఉసిగొల్పి సామాన్యులపై దౌర్జన్యాలు చేసి భూములను బుక్క పట్టడం తమకు తెలియవని స్పష్టం చేశారు. అలాగే, బడుగు బలహీన వర్గాల నేతల మీద అహంకారంతో పేపర్లు విసిరి కొట్టడం కూడా తమకు తెలియదన్నారు. ప్రభుత్వం ఎన్ని పనికిమాలిన ప్రగల్భాలు పలికినా, ఎన్ని డైవర్షన్ డ్రామాలు ఆడినా.. 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టబోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నించకుండా విడిచిపెట్టబోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రైతు డిస్కంపై ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సి) ముందుకు బీఆర్ఎస్ పార్టీ

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బృందం ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై, వాదనలను వినిపించనున్నారు. ఈ బృందంలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిలతో పాటు ఇతర సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. 'రైతు డిస్కం' ప్రతిపాదనల వల్ల రైతాంగానికి, రాష్ట్ర విద్యుత్ రంగానికి వాటిల్లే నష్టాలను ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ నగర శివారులోని నిజాంసాగర్ కెనాల్ లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్థానిక పోలీసులు వెలికి తీశారు. నాగారం లోని దంకింగ్ వద్దగల బ్రిడ్జి ప్రాంతంలో 40 సంవత్సరాల వయస్సు గల మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.మృతిని ఒంటిపై కాలిన గాయాలు ఉండడంతో హత్య చేసి ఆనవాళ్లు దొరకకుండా ఉండేందుకు కాలువలో పడేసారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే స్థానిక పోలీసులు మాత్రం సంబంధిత చనిపోయిన వ్యక్తిని స్థానిక సాయి నగర్ 2 ప్రాంతానికి చెందిన జితేందర్(42) గా తెలిపారు. చిత్తు కాగితాలు ఏరుకొని జీవించే జితేందర్ మూడు రోజులుగా కనిపించలేదని స్థానికులు తెలిపారు. అయితే జితేందర్ కనిపించకుండా పోయి శవమై తేలడం పలు అనుమానాలకు దారితీసింది. ఐదు టౌన్ పోలీసులు మాత్రం కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# చారిత్రాత్మక విజయం సాధించిన ఇషాని అభినందించిన సీఎం

## ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో

## 43 హిట్స్‌తో ప్రపంచ రికార్డు

హైదరాబాద్, బతుకమ్మ :ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ - 2026 షూటింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచి చారిత్రాత్మక విజయం సాధించిన ఇషా సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం అభినందనలు తెలిపారు. మ్యూనిచ్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 43 హిట్స్ సాధించి అద్భుతమైన స్కోర్‌తో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన ఇషా, సాధించిన విజయం భారత షూటింగ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇషా సింగ్ తన అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో లక్షల మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆమె అద్భుతమైన ప్రదర్శన భారత క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని, భారత క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. ఇషా సింగ్ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని, ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆమె దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.




# ఎల్లారెడ్డిపల్లిలో ఘోర అగ్నిప్రమాదం

## ఇల్లు పూర్తిగా దగ్ధం

## 2 లక్షల నగదు, బంగారం, అగ్నికి ఆహుతి

## కట్టుబట్టలతో రోడ్డున పడ్డ కూలీ కుటుంబం

## ఆదుకోవాలని గ్రామస్తుల డిమాండ్

ఇందల్వాయి, బతుకమ్మ :ఇంద ల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మేదరి నర్సయ్య అనే కూలీ అద్దె కు ఉంటున్న నివాస గృహం పూర్తిగా తగలబడింది. బాధిత కుటుంబం, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మేదరి నర్సయ్య, ఆయన భార్య ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ తమ ముగ్గురు చిన్న పిల్లలను పోషించుకుంటున్నారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం నర్సయ్య కూలి పనికి వెళ్ళాడు. ఆ సమయంలో ఆయన భార్య ఇంటి బయట పిల్లలకు స్నానం చేయిస్తోంది. ఒక్కసారిగా ఇల్లాలు గమనించేసరికి ఇంటో నుంచి భారీగా పొగలు, మంటలు వ్యాపించాయి. కంగుతిన్న ఆమె కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, బట్టలు, బంగారంతో పాటు వచ్చే నెల 1వ తేదీన చిట్టీ డబ్బులు చెల్లించడం కోసం తెచ్చి పెట్టుకున్న రూ. 2 లక్షల నగదు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కంటి ముందే సర్వస్వం కాలిపోవడంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ప్రమాద తీవ్రతకు సర్వస్వం కోల్పోయి అనాథలుగా మారిన మేదరి నర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆర్థికంగా ఆదుకోవాలని ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

